# 20. అపవాదు

రోళ్లుపగిలే రోహిణీకార్తి. ఆ చెవిలో గాడ్పు యీ చెవిలోకి కొడుతూ వుంది. ఎక్కడెక్కడ జనమూ ఇళ్ళల్లోనే దాక్కున్నారు- గాడ్పులకు భయపడి. విధిలేని ఆనందంలాటి యువకులు ఆ మిట్టమధ్యాహ్నపు టెండలో ఇంకా తిరుగులాడుతూనే వున్నారు.

కాళ్ళకు చెప్పులులేవు. రోడ్డుమీది వేడికి కాళ్లు బొబ్బలెక్కుతున్నాయి. తలపైని సూర్యుని ప్రచండ కిరణభారం దుర్భరంగావుంది. మనస్సుకు శాంతిలేదు. దేహమంతా- బాహ్యంగానూ, ఆంతరంగికంగానూ కూడా వుడకిపోతోంది. అలసి సొలసి, నిస్పృహతో ఇల్లు జేరుకున్నాడు.

తండ్రిని చూచి- ఆ ఆరేళ్ళ కుర్రవాడు ఎదురు వెళ్లాడు చేతులు చాపుతూ ఎత్తుకోమన్నట్టుగా. ఆనందానికి విసుగ్గా వున్నా కొడుకు 'ఆనందం' కోసం ఎత్తుకున్నాడు.

బలవంతాన నవ్వుముఖం పెడ్తూ "ఇంక దిగు బాబూ."

కుర్రవాడు దిగాడు.

"నాన్నా కానీ ఇయ్యవూ?" కుర్రవాడు అతివినయంగా అడిగాడు. ఆనందం జేబు తడివి చూచుకున్నాడు- ఖాళీ! కుర్రవాడు నిరాశతో బిక్కమొగంపెట్టాడు. తన బి.ఎ పట్టా కన్నకొడుక్కు 'కానీ'ని కూడా తెచ్చిపెట్టలేకపోయింది.

తన చదువు నిరర్థకం. తను భూమి మీద బ్రతికి ఎవరికి ఆనందాన్నిస్తున్నాడు? జీవచ్ఛవం! తనను తను తిట్టుకున్నాడు. అప్రయత్నంగా అశ్రువులు దొర్లాయి. కుర్రవాడు

'కానీ' అడిగిన విషయం జ్ఞాపకం వస్తుంటే అతని హృదయంలో కరకు ములుకులు గ్రుచ్చినట్టుగా వుంది.

భార్యవచ్చి కుర్రవాణ్ణి ఎత్తుకుంది. భర్త ముఖంలో ప్రతిఫలించే నిరాశకూ, నిరుద్యోగ పిశాచికీ ఆమె మృదు హృదయం ఘోషించింది. లక్ష్మి ముఖాన్ని చూచిన ఆనందానికి దుఃఖ సముద్రం పొంగింది. భార్యను ఏ విధంగానూ సంతోష పెట్టలేని తను గృహస్థు అనిపించుకోవటంకన్నా 'సన్యాసి' అనిపించుకోవటం మేలనిపించింది. భర్తదుఃఖాన్ని చూడలేక లక్ష్మి కుర్రవాణ్ణి అవతలికి తీసుకుపోయింది. వేడి నిట్టూర్పుతో ఆనందం మంచంమీద కూలబడ్డాడు.

తల్లి వచ్చింది- వాళ్ల దీనావస్థలు చూస్తూ తను బ్రతికి వుండటం దుర్భర మనిపించింది. కన్నతల్లికిగాని పుత్రుడు బ్రతికి వుండటమే తనకొక నేరంలేని శిక్ష. దుఃఖాన్ని ఎంత ప్రయత్నించినా మింగలేకుండా వున్నాడు. తల్లిని చూచి ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు.

"ఇంతసేపు ఎక్కడ వున్నావు నాయనా?"

"ఎవరో మాట్లాడుతుంటే వుండిపొయ్యాను" ఆనందం పొడిగొంతుతో సమాధానం చెప్పాడు.

"నీ కోసం ఎవరో- జడ్జీగారట- కబురంపార్రా!"

నిరాశా నిశి తాండవించే ఆనందం ముఖ మండలంలో ఒక లేత కాంతి కిరణం ప్రసరించింది.

"అయితే వెళ్ళి వస్తానమ్మా!"

"ఎండలో యిప్పుడేగా వచ్చింది- స్నానంచేసి భోజనంచేసి వెళ్ళు."

"పెద్దవాళ్ళతో పని-"

"ఏపనైనా అన్నం నీళ్లూ మాని చేసుకుంటారా?"

"అయితే త్వరగా వడ్డించు-" ఆనందం లేస్తూ అన్నాడు.

## 2

పత్రిక చదువుతూ వున్న జడ్జీగారికి నమస్కరించి నిలబడ్డాడు- ఆనందం.

ముసలి కళ్ళజోడులోనుంచి తీక్షణంగా చూస్తూ, తన పక్కనే కుర్చీని చూపుతూ జడ్జీగారన్నారు "ఇల్లా కూర్చోండి."

ఆనందం కూర్చున్నాక, కళ్ళజోడు కేస్‌లో పెడుతూ జడ్జీగారడిగారు "ఇప్పుడు మీరు ఖాళీగానే వున్నారా?"

ఆనందం సవినయంగా 'అవు'నన్నట్టు తల వూపాడు.

"మీ తండ్రిగారు నాకు స్నేహితులు, మీకు వీలయితే మా అమ్మాయికి ప్రైవేటు చెప్తారేమోనని పిలిపించాను."

"చిత్తం."

"రేపు మంచిది, రేపటినుంచే మొదలుపెట్టండి."

"అల్లాగే."

జడ్జీగారు ఇంకేమీ మాట్లాడలేదు. కుమార్తెను పిలిచారు.

"హేమా! రేపటినుంచీ ఈ మాస్టారి దగ్గర చదువుకో!"

హేమలతకు పదిహేను సంవత్సరాలుంటాయి. అందమైన పిల్ల. వచ్చేసంవత్సరం వివాహం చేద్దామనుకున్నారు జడ్జీగారు.

హేమ ఒక్క క్షణం ఆనందాన్ని చూచి 'సరే'నన్నట్టు తలవూపింది.

ఆనందంలేచి ధన్యవాదాలర్పిస్తూ యింటిత్రోవ పట్టాడు.

పదిహేను సంవత్సరాలు కష్టపడి సంపాదించిన తన బి.ఎ. పట్టా మొట్ట మొదటిసారి తన జీవితంలో పనికివచ్చి నందుకు ఆనందం సంతోషించాడు.

ఇంటికివచ్చి తల్లితో అన్నాడు: "అమ్మా! ఉద్యోగమయింది!"

ఆనందాశ్రువుల్ని రాలుస్తూ తల్లి అంది: "జీతమెంత నాయనా!"

జీతమెంతో తనకే తెలియదు. ఇంక తల్లి కేం చెప్తాడు? తను జడ్జీగారిని అడగనూలేదు, ఆయన 'ఇంత' అని చెప్పనూ లేదు. అయినా జడ్జీపనిచేస్తూ ఇరవై రూపాయిలన్నా యివ్వక పోతాడా? నిజం బైటపెడితే తల్లికి కష్టంగా వుంటుందేమోనని ఆనందం అన్నాడు: "ఇరవై రూపాయలమ్మా!"

మొలబంటి దుఃఖంలో మోకాటిబంటి సంతోషం- ఆ మాతృహృదయానికి.

తరువాత భార్యతో అన్నాడు: "లక్ష్మీ, ఇరవై రూపాయిల జీతం మీద ఉద్యోగమయింది."

తన నోములు ఫలించినందుకు ఆ యిల్లాలు మనస్సులో భగవంతుడికి ధన్యవాదాలర్పిస్తూ అనుకుంది- "మా వేణుకు యింక కానీలకు లోటుండదు."

## 3

పాఠం చెప్తూ వున్న మాస్టార్ని హేమ ప్రశ్నించింది: "మాస్టారూ- మీకు జీతమెంత?"

ఈ అసందర్భపు ప్రశ్న మాస్టారికి కొంచెం కష్టంగానే తోచింది. హేమకు ఇది కొత్తకాదు. అనేక విషయాల్లో తనను ప్రశ్నిస్తుంది, వాటిలో ఎక్కువ తనను గురించే ఇప్పటి ప్రశ్నకు తల్లి దగ్గర బొంకినట్టుగా– ఇక్కడ బొంకేందుకు మాస్టారికి వీలులేక నిజాన్నే బయటపెట్టాడు.–

"మీ నాన్నగారు ఎంత యిస్తే అంత."

ఇంతతో హేమ ఆగలేదు. తన ప్రశ్ననే మరో రూపంలో అడిగింది. "మీకు ఎంత యిస్తారని ఉద్దేశపడుతున్నారు– మాస్టారూ?"

"ఎంతైనా నాకు ఇష్టమే నమ్మా"– మాస్టారు ఒక విధంగా తప్పుకున్నాడు.

తన కుటుంబ విషయాలు హేమ కెందుకో ననుకున్నాడు. తన సమాధానాన్ని ఒక చిన్ని ఉపన్యాసంగా చెప్పాడు. "ఇంతేమిటమ్మా– ఎంత చెట్టుకు అంతగాలి! పట్నవాసంలో– ఎంతలోనైనా సరిపెట్టుకోవచ్చు."

హేమ కొంచెం కొంటెగా అడిగింది. "అయితే నెలకు పది రూపాయిలు సరిపోతయ్యా మాస్టారూ?"

"అది సాధ్యం కాదు– హేమా!"

"మరి ఎంత కావాలి మాస్టారూ?"

మళ్ళీ మొదటి ప్రశ్నకే వచ్చింది సంభాషణ.

ఇంక దాచటం భావ్యం కాదనుకొని చెప్పాడు: "ముప్పై రూపాయిలయితే కటాకటీగా సరిపోతాయి–"

హేమ ఇంకేమీ మాట్లాడలేదు. మామూలు పాఠాల్ని చదువుకొని వెళ్ళిపోయింది.

నెల తిరగంగానే జడ్జీగారు మాస్టారిచేతుల్లో ఇరవై రూపాయిలు పెట్టారు. ఆనందం వూహించిందికూడా అంతే– ఇంకేమీ మాట్లాడలేదు.

మర్నాడు– హేమకు చదువు చెప్పటం అయిపోయింది.

ఇంటికి వెళ్లేందుకు లేస్తూవుండగా హేమ అంది: "మాస్టారూ! మీతో వొకటి చెప్పాలనుకున్నాను."

అర్థంకాని చూపుల్తో మాస్టారు హేమ వైపు చూచారు. ఆమె అంది: "ఇరవై రూపాయిలు మీకు సరిపోతయా మాస్టారూ?"

ఆమె మాటలు ఎంతో మృదువుగా వున్నాయి. ఆమె దృక్కులు తన అభాగ్య జీవనానికి సానుభూతిని తెల్పుతున్నాయి.

"ఎల్లాగో సరిపెట్టుకోవాలిగా–"

"మాస్టారూ! ఈ డబ్బుకూడా తీసుకోండి" హేమ చేతిలోని రెండు పదిరూపాయిల నోట్లూ గాలికి రెపరెప కొట్టుకుంటున్నాయి.

మాస్టారు కొద్ది ఆశ్చర్యంతో అన్నారు: "నిన్న మీ నాన్నగారు ఇచ్చారమ్మా" తన జీతం ఇదివరకే ముట్టిందన్నట్టు.

"అది నాకు తెలుసు మాస్టారూ, నేనుకూడా మీ కివ్వాలనుకున్నాను."

మాస్టారికి హేమ చూపే భూతదయా సానుభూతీ చాలావరకు గ్రాహ్యమయ్యాయి. ఇదివరకు తన కుటుంబ విషయాల్ని గురించి ఆమె తనను ఎందుకు ప్రశ్నించించో ఇప్పుడు మాస్టారికి తెలిసిపోయింది. కాని ఈ విషయం జడ్జీగారికి తెలుస్తే తను ఏమని సమాధానం చెప్తాడు? ఉత్తనే వచ్చిందనే ఆశతో అంతరిక్షాన్ని అందుకుంటే ముందున్న ముసళ్ళ పండుగకు ఎలా తట్టుకోవడం?

"ఒద్దు హేమా, మీ నాన్నగారిచ్చేదే నాకు చాలు."

"మాస్టారూ, ఈ డబ్బు మీద యింకెవరికీ అధికారం లేదు. మిమ్మల్ని చూచినప్పటినుంచీ, మీ కుటుంబ విషయాలు తెలుసుకున్నప్పటినుంచీ– నాలో మీకు సహాయం చెయ్యాలనే వాంఛ ప్రబలింది. మా నాన్నగారు సంపాదించేది నిజానికి మాకు ఎక్కువే! మరేం సందేహం లేకుండా తీసుకోండి."

ఆనందం హృదయానికి యీ మాటలు అమృత ధారగా వున్నాయి. తనలాటి అభాగ్యజీవికికూడా సానుభూతి చూపేవాళ్ళు యీ లోకంలో ఇంకా వున్నారని ఆనందం ఆనాడు తన జీవితంలో మొట్టమొదటిసారి తెలుసుకున్నాడు. తన కుటుంబ పరిస్థితి అంతా అతని కళ్ళముందు తిరిగింది. తన ఒక్క రెక్కాడుతేనేకాని ఇంట్లో డొక్కలాడవు. మాస్టారికి కళ్ళ నీళ్ళు తిరిగాయి. నోట్లు గాలికి కొట్టుకుంటున్నాయి.

"తీసుకోండి మాస్టారూ– ఇవి మీ దగ్గరకే వస్తానంటున్నాయి"– హేమ పెదవుల మీద చిరునవ్వు నాట్యం చేస్తోంది.

హేమ ముఖంవైపు చూచాడు. ఆమె ప్రశాంత దృక్కుల ప్రకాశాల్లో అతనికి స్వర్గం కన్పిస్తోంది. ఇంతకన్న ఇప్పుడు నీవు చేయకలిగింది కూడా లేదని అంతరాత్మ అతన్ని ముందుకు తోస్తోంది. తనలాటి నిష్ప్రయోజకులు (లోకం దృష్టిలో) అర్థించని దాన్ని స్వీకరించటం తప్పులేదని అతని మనస్సుకూడా ప్రోత్సహించింది. హేమలాటి దయార్ద్రహృదయలింకా యీ లోకంలో వుండబట్టే కొంతమంది దీనులకింకా జీవితాల మీద ఆశ వుందని ఆనందం గట్టిగా నమ్మాడు. అతని చేతులు నోట్లవైపు సాగాయి. నోట్లతోపాటు అతను అశ్రుకణాల్ని– కృతజ్ఞతాపూర్వకంగా వదిలాడు.

హేమ అన్నది: "మాస్టారూ, మీకు డబ్బు కావాలంటే నన్ను అడగండి– నేను ఇస్తాను– ఏం?"

ఈ లోకంలో ఒక ఆత్మను ప్రేమించే వేరొక ఆత్మ వుంటుంది. ఆ సంబంధం మాత్రం యిట్టిదని చెప్ప శక్యంగాదు. హేమకు అంత సానుభూతి ఎందుకో? మంత్రబద్ధుని వలె ఆమె వైపుచూస్తూ నిలబడిపొయ్యాడు.

సమాధానం రాకపోవటం వల్ల హేమ మళ్లీ అడిగింది: "ఏం మాస్టారూ- అడుగుతారుకాదూ?"

అతనికి ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు. ఒక విధమైన బాధలో సుఖాన్ని అనుభవిస్తోంది- అతని ఆత్మ. హేమను సంతోషపెట్టేందుకు అతనన్నాడు: "సరేలే అమ్మా!"

ఈ సంఘటనను తలుచుకుంటూ, తనలో తను ఆశ్చర్యపోతూ ఇంటికి వెళ్ళి యీ ఇరవైరూపాయల్నీ భార్య చేతికిచ్చాడు.

ఆమె కొంచెం ఆశ్చర్యబోతూ అడిగింది, "నిన్ననేగా జీతం తెచ్చారు- అప్పుడే నెల తిరిగిందా?"

ఆనందం ఏమీ మాట్లాడలేదు.

ఆమె మళ్ళీ అన్నది: "నాతో అబద్ధం చెప్పారు: అసలు మీకు జీతం నలభై అయితే- నాతో ఇరవయ్యేనని చెప్పారు- కాదూ?"

ఆనందం కొద్దిగా చలించి అన్నాడు. "కాదులే లక్ష్మీ!"

"మఱి యీ డబ్బు ఎక్కడిదో నాకు చెప్పరూ?"

ఆనందానికి ఇదంతా చెప్పటం ఇష్టంలేదు.

"అదంతా నన్ను అడగబోకు లక్ష్మీ!" లక్ష్మి ఇంకేమీ మాట్లాడలేదు. తనకు తను సరిపెట్టుకొని వెళ్ళిపోయింది.

## 4

"ఆనందం!"

బజారువెంట తొందరగా నడుస్తూన్న ఆనందానికి ఆ కేక వినబడలేదు.

ఈమారు చప్పట్లు, తరువాత 'ఆనందం!' అని కేకా- వెనక్కు తిరిగిచూచాడు. పాత స్నేహితులు ముగ్గురు కాఫీహోటల్లో కూర్చొని, చెయ్యి వూపుతున్నారు. వెళ్ళి నాలుగో కుర్చీని ఆక్రమించుకొన్నాడు.

"పిలిచినా వినపడదురా మనవాడికి-" ప్రకాశం గొణిగాడు.

"నిజంగా నాకు వినబడలేదు భాయీ!"

"నీకెల్లా వినబడుతుందిరా? రొమాన్స్‌లో పడ్డాక. అసలు మేమొక లెక్కా?"- అన్నాడు శివరావు.

ఆనందానికి యీ సంభాషణ తలనొప్పిగా వుంది. వీళ్ళు ప్రత్యేకం తనను ఏడిపించేందుకు పిలిచినట్టుగా వుంది.

"అదేమిట్రోయ్!" అని వున్నదాన్ని ఇంకొంచెం పొడిగించాడు లక్ష్మణరావు.

"ఊ. తెలియదూ? వాడికి కోపం వస్తుంది- చెప్పనట్రా ఆనందం!" అన్నాడు శివరావు, ఒక వెకిలి నవ్వును విసురుతూ.

తనకు కోపంవచ్చే విషయమేమిటా అని ఆనందానికి సందేహం కలిగింది. అది తెలిసికోవాలని కూడా కుతూహలంగా వుంది.

"అంతటి విషయం ఏమిట్రా?- అయినా చెప్పు చూద్దాం."

దొరికిందే సందనుకున్న శివరావు అందుకున్నాడు: "ఇప్పుడు నీవు ప్రైవేటు చెప్తున్నావే- హేమలత-"

మిగతా ఇద్దరూ ఫక్కున నవ్వేరు, ఆనందానికి మాత్రం ఇది అగమ్యగోచరంగా వుంది. శివరావువంక చూచాడు- వాక్యాన్ని పూరించమన్నట్టు.

"ఆ హేమలతను పట్టాక మనవాడి పని మహాజోరుగా వుందిలేరా? దొరుకుతే అల్లాటి లక్కీఛాన్సు దొరకాలి కాని- మిగతా ఉద్యోగాలు ఉద్యోగాలురా!" శివరావు మిగతా ఇద్దరితోనూ కూడా కలిసి నవ్వుతున్నాడు.

ఆనందానికి రోమరోమమూ చలించింది. తననుగూర్చి తన స్నేహితులు యింత దురభిప్రాయంతో వున్నారని ఆనందం కలలో కూడా అనుకోలేదు. నిజం తెలుసు కోకుండా యీ నీచులు హేమ పవిత్రతనే శంకించారు. ఇలాటి వాళ్ళు లక్షమందయినా ఆమె కాలిగోటికి సరిరారు. కాఫీహోటల్లో పొట్ట పగిలేట్టు తిని ఇలాటి అపవాదుల్ని ప్రచారం చెయ్యటానికి తప్ప- వీరి చదువు ఇంకెందుకూ పనికిరాదు!

ఆనందం మాట్లాడకపూర్వమే లక్ష్మణరావన్నాడు: "పోనీలేరా- మనవాడు ఎవడో వొకడు పెద్దెత్తు వేశాడంటే మనం అందరం సంతోషించ వలసిన విషయం."

పిల్లికి చెలగాటం, ఎలుక్కు ప్రాణసంకటం లాగుంది ఆనందం పని. వారందరకూ హేళన! అతని ఆత్మకు అశాంతి! వీళ్ళు ఏ విజ్ఞానంతో బి.ఎ పట్టాల్ని చేపట్టారో ఆ యూనివర్శిటీ వాళ్ళకే తెలియాలి!

ఈ సంభాషణ ఆనందం హృదయాన్ని గాయపరిచింది. "ఇంక యీ సంభాషణ కట్టిపెట్టండి" అన్నాడు విసురుగా.

"చూశావా అప్పుడే కోపం వచ్చింది. నిజమాడుతే నిష్ఠూరంకాదా" అన్నాడు శివరావు.

చూడబోతే స్నేహితులు. ఏమనేందుకూ వీలులేదు. ఇంక ఆ ప్రదేశంలో, ఆ నీచుల మధ్య ఒక్క క్షణం వుండ బుద్ధిపుట్టలేదు.

"వెళ్తాభాయీ- పని వుంది."

మళ్ళీ అందరూ గార్దభ స్వరాల్ని మేళవించి నవ్వేరు. ఆనందం ఎల్లాగో బయటపడ్డాడు.

## 5

"ఆనందం మాస్టారూ!"

ఆ పెద్దపిలుపుకు హేమ వెనక్కు తిరిగి చూచింది. -

నలుగురు విద్యార్థులు గుమిగూడి పెద్దగా నవ్వుతున్నారు.

"మాస్టారి మీద మంచి ప్రేమరా- పాపం" అన్నాడొక విద్యార్థి.

"పాపం-నిరాశ చేశావుకదరా?" అన్నాడు మఱొకడు సానుభూతిగా.

హేమకు అరికాలిమంట నెత్తికెక్కింది. కోపంతో ఆమె కంపించింది. మౌనంతో ఇంటికి మళ్ళింది.

హేమ మనస్సు మనస్సులో లేదు. గడచిన ఆరు మాసాలలోను లోకులు తన్నీవిధంగా అనుమానిస్తున్నారని ఆమె తెలుసుకోవటం అదే మొదటిసారి. తనలాటి కులీనను అన్యాయంగా, అక్రమంగా, అనుమానిస్తూన్న లోకం- ముక్కంటి మూడోకన్ను వుంటే భస్మీభూతమయ్యేది!

మాస్టార్ని గూర్చి ఆలోచించింది: నిలువ నీడలేని సమయంలో తన తండ్రి అతన్ని జేరదీశాడు. ఆయన దీనస్థితికి తన మృదుహృదయం సానుభూతిగా ఘోషించింది: దీన్ని సహించలేకపోయింది లోకం! మాస్టారు- ఎంత మంచివాడు! ఆయనకు భార్యవుంది, కుమారుడున్నాడు. ఇంక ఏ ఆధారం మీద ఆయన తనను ఆశించాడని లోకం అపోహపడ్డదో? తనను, తన వంశ గౌరవాన్ని కూడా హేళన చేస్తోంది! ఇందాక విద్యార్థులు నవ్విన నవ్వు - కాదు - వికటాట్టహాసం - ఇంకా ఆమె చెవుల్లో గింగురుమంటూ వున్నకొద్దీ - ఆమె బుర్రలో, భూతాలు నాట్యం చేస్తున్నాయి. ఆమెకు తన కాలికింది భూమి క్రుంగిపోతూన్నట్టు తోచింది, కంటివెంట నీరు వచ్చింది.

"హేమా!"

తండ్రి పిలిచాడు. కళ్ళనీళ్ళు వొత్తుకొని తండ్రి ఎదుట నిలబడ్డది. తండ్రిముఖంలో కోపమూ విచారము స్పష్టంగా కన్పిస్తున్నాయి.

"ఎందుకు నాన్నగారూ?"

తండ్రి ఏమీ మాట్లాడకుండా ఒక వుత్తరం ఆమె చేతికిచ్చి కోర్టుకు వెళ్ళిపొయ్యాడు.

హేమ ఏకాంతంగా ఆ వుత్తరాన్ని చదివింది. దాంట్లోని ప్రతి అక్షరమూ తనను నిలువునా విమర్శిస్తూనే వుంది. ఎవడో ఆకాశరామన్న తండ్రికి తన ప్రవర్తనను గూర్చి నీచంగా రాస్తూ, మాస్టారితో తను ఎక్కడికో లేచిపొయ్యేందుకు ప్రయత్నిస్తూన్నట్టు సూచించి, తండ్రికొక 'అలారమ్ సిగ్నల్' ఇచ్చాడు. తన వంశానికి అలాటి వుత్తరం తల వొంపులు! ఏ పాపం ఎరుగని మాస్టార్ని- ఆ బీదవాణ్ణి - ఆ సత్పురుషుణ్ణి పట్టుకొని అల్లా రాసేందుకు ఏ వెధవ సోమరి కలానికి బుద్ధి పుట్టిందో! అది సిరాతో కాదు, రాసింది - కాలకూట విషంతో. తన తండ్రి తనను అనుమానించక పోయినా జాగ్రత్తగా వుండమన్నట్టు చెప్పాడు. లోకమంతా కలిసి తన మీద కత్తికట్టినట్టుగా తోచింది- హేమకు.

ఉత్తరాన్ని నలిపి టేబిల్‌మీదికి విసిరింది: నిర్జీవపు కాగితం, చుట్టలుచుట్టుకొన్న విషసర్పంలాగు పడివుంది.

హేమ కర్తవ్యం ఆలోచించింది. అందరూ తనను అనుమానిస్తున్నారు. అదుగో పులి అంటే యిదుగో తోక, అన్నట్టుగా వుంది. ఈ ప్రవాహాన్ని తానొక్కతే ఆపలేదు! ఈ అపవాదుకు ప్రతీకారమూ లేదు. మాస్టార్ని ఇంక ఇంటికి రావద్దని చెప్పటంకన్న ఇంకో ఉపాయమూ లేదు. లోకాన్ని తిట్టింది. తనను తిట్టుకుంది. హృదయవేదనతో కృంగిపోయింది.

## 6

చీకటిపడుతూవున్న సమయంలో మాస్టారు వచ్చారు. మాస్టారి హృదయంలో విషచ్ఛురికలు గ్రుచ్చినట్టుగా వుంది. హేమ ఖిన్నవదనాన్ని చూచిన మాస్టారి కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

'మాస్టారూ!'- బొంగురుపోయిన కంఠంతో హేమ మాస్టార్ని పిలిచి, ఇందాకటి వుత్తరం అందిచ్చింది.

ఉత్తరాన్ని చదివిన మాస్టారుకి అమితకోపం వచ్చిందిః కాని బీదకోపం ఎవర్నేం చేస్తుంది, కోపం దుఃఖం కింద మారింది.

"మాస్టారూ! దుఃఖించి లాభంలేదు- మన సోదర ప్రేమను శంకించిన లోకాన్ని ఏమంటారు?"

ఎవరేమనగలరు?

"అమ్మా! యింక నేను వెళ్తాను. మనిద్దరం ఇకనుంచీ నూతన వ్యక్తుల్లాగ మెలగుదాం. మనలాటి ప్రేమకు ఈ లోకంలో తావు లేదు" – మాస్టారి మాటల్లో దుఃఖతరంగాలు గంతులేస్తున్నాయి.

"మాస్టారూ! అంతకన్న చేసేదేమిలేదు. ఎవ్వరేమన్నా పడివుండాల్సి వచ్చింది. కాని భావిజీవితంలో ఎప్పుడన్నా ఇద్దరం కలుసుకుంటే–"

ఆమె వాక్యం పూర్తికాకపూర్వమే అతను అన్నాడు: "అల్లాంటి సంఘటన్ని కోరవద్దమ్మా. నా జీవితం అంతా ఇంతే! నా మూలాన నీ జీవితంలోకూడా కళంకం యేర్పడ్డది– దానికి నన్ను క్షమించమ్మా."

"నేను క్షమించే దేమిటి మాస్టారూ? ఇందులో మన తప్పేమీ లేదు. ఇది నేరంలేనిశిక్ష! ఒద్దు– మాస్టారూ– దుఃఖించి లాభం లేదు. ఇంకెక్కడైనా వుద్యోగం చూచుకోండి. అందాకా యీ డబ్బు వాడుకోండి"– హేమ బలవంతంగా వంద రూపాయల నోటును మాస్టారి జేబులో కుక్కింది.

ఇంత ఉపకారం చేసే వ్యక్తిని ఆనందం ఇదివరకు చూడలేదు– ఇకముందు కూడా చూడలేదు. ఆమె కాళ్ళ మీద పడాలనిపించింది. వంగాడు; హేమ వారించింది.

"మాస్టారూ! తప్పు. మీరు పెద్దవారు!"

"మరువలేను. నిన్ను చూడటం నా జీవితానికి ఇదే తుదిసారి. నాకు కూతురు పుడితే నీ పేరు పెట్టుకొని ధన్యుణ్నవుతాను."

హేమ మాస్టారి కృతజ్ఞతకు ఆనందబాష్పాల్ని రాల్చింది.

"ఇంక వెళ్తానమ్మా!"

మాస్టారు వెనక్కులాగే హృదయంతో, కన్నీటితో కడిగిన వదనంతో, బరువైన కాళ్ళను యీడ్చుకుంటూ ఆ చీకటి సముద్రంలో మునిగిపొయ్యాడు.

"మాస్టారూ!" హేమ పిలిచింది.

సమాధానంలేదు. ప్రకృతిమాత మాత్రం ప్రతిధ్వనించింది.

"మంచివాడు– నోరారా పొమ్మని చెప్పాను. కఠినురాల్ని" అనుకొని నిస్పృహతో పక్క మీద వాలింది, కన్నీళ్ళను వొత్తుకుంటూ.